సాక్షి మెదక్

గురువారం । 23 । జనవరి । 2025



'సహకారం' ఆదర్శం

కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రగతిలో ఆదర్శంగా నిలుస్తోంది.

వివరాలు 8లో ▸



వైద్య సేవలపై ఆరా

తూప్రాన్ సీహెచ్‌సీ, కొడిపల్లి పీహెచ్‌సీని ఒడిశా బృందం బుధవారం సందర్శించింది.

వివరాలు 8లో ▸



జాబితాలో మా పేర్లు ఏవి..?

జాబితాలో పేర్లు లేవని రెండో రోజు గ్రామ సభల్లో నిరసనలు, నిలదీతలు కొనసాగాయి.

వివరాలు 9లో ▸

భద్రత.. బాధ్యత

చేరుదాం.. సురక్షితంగా..

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు



మెదక్ పట్టణంలో రోడ్డు భద్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదకర మలుపుల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం, వాహనదారుల అతివేగం, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకుండా.. సీటు బెల్టు పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయడం, విశ్రాంతి లేకుండా వాహనం నడపడం ఇందుకు కారణం. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కథనం.

> గతేడాది అక్టోబర్ 16న శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో వాగులో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురు మరణించారు. ఇందులో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ మద్యం మత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారించారు.

33 బ్లాక్ స్పాట్ల గుర్తింపు

జిల్లా మీదుగా 44, 161, 765డీ, 765 డీజీ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. అవి 150 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అయితే మిగితా జిల్లాలతో పోలిస్తే జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం గతేడాది 568 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. 302 మంది మృత్యువాతపడ్డారు. మరో 459 మంది క్షతగాత్రులయ్యారు. అయితే ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు మద్యం మత్తు, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం వల్లే జరుగుతున్నాయని జిల్లా యంత్రాంగం నిర్ధారించింది. ప్రమాదాల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలో 33 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించింది. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది.

వీటిపై తక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లాలోని రహదారులపై ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చి వేయాలి.
- రోడ్డు భద్రత నియమాలు కఠినంగా అమలు చేయాలి.
- మలుపుల వద్ద చెట్ల పొదలు తొలగించాలి.
- ప్రమాదకర ప్రాంతాల్లో రేడియంతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- జాతీయ రహదారులపై వేగ నియంత్రణ పరికరాలు అమర్చాలి.
- ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలి.
- రహదారుల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పటిష్ట చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం. 33 బ్లాక్ స్పాట్‌లను గుర్తించి రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశాం. అలాగే పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను చైతన్య పరుస్తున్నాం.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

రోడ్డు నిబంధనలు తప్పనిసరి: కలెక్టర్

మెదక్‌జోన్: రోడ్డు భద్రత మనందరి బాధ్యత.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డితో విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాణం చాలా విలువైందని, తల్లిదండ్రులు బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని విద్యార్థులు చెప్పాలని సూచించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా 20 శాతం మరణాలు తగ్గాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటస్వామి, ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎంఈఓ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయా

- ప్రజలు క్షమించాలి
- రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): ఈ ఐదేళ్ల కాలంలో అనుకున్నంత మేర అభివృద్ధి సాధించలేకపోయామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన మున్సిపల్ చివరి సమావేశం అనంతరం కౌన్సిలర్లు నాగరాజు, అనిల్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము ఎన్నో ఆశలతో పదవిని అలంకరించామని, అభివృద్ధి పనులు చేయనందుకు ప్రజలు క్షమించాలని కోరారు. కరోనాతో పాటు నిధుల మంజూరు కాకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారిందని వాపోయారు. 2020లో జనవరిలో ప్రమాణస్వీకారం చేయగా, తర్వాత రెండు నెలలకే కరోనాతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. 2023లో పలు పథకాల కింద రూ. 10 కోట్ల మేర నిధులు మంజూరు కాగా, రూ. ఆరున్నర కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడితే ఇప్పటివరకు డబ్బులు రాలేదని వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు అభివృద్ధి పనులకు సంబంధించి వేర్వేరు పథకాల కింద రూ. 50 కోట్లు మంజూరు కాగా, నిధులు మళ్లిపోయాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రామాయంపేటకు రెవెన్యూ డివిజన్ మంజూరు కాగా, ఇంత వరకు గెజిట్ విడుదల కాలేదని వాపోయారు. తాము అధికారంలో లేకపోయినా అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు మున్సిపాలిటీ అభివృద్ధి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, యాదగిరి, అహ్మద్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు డీజీపీ రాక

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర డీజీపీ జితేందర్‌రెడ్డి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయానికి రానున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయ ఆవరణలో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్‌లను ఆయన ఆవిష్కరిస్తారని తెలిపారు.

25న అభ్యర్థులకు రాత పరీక్ష

మెదక్ కలెక్టరేట్: ఈనెల 25వ తేదీన ఖాళీగా ఉన్న స్టెనో- టైపిస్ట్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన జాబితాలో పేరు ఉన్న అభ్యర్థులకు హాల్‌టికెట్‌ను పోస్టు ద్వారా పంపించామని తెలిపారు. రాని వారు 24న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఫొటో, ఏదైనా గుర్తింపు కార్డు చూపించి హాల్‌టికెట్ పొందవచ్చని సూచించారు.

నాణ్యమైన ఆహారం తప్పనిసరి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ హైమావతి

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు నాణ్యమైన ఆహార పదార్థాలే ఇవ్వాలని డీడబ్ల్యూఓ హైమావతి అన్నారు. బుధవారం ఆమె కార్యాలయంలో జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల నిల్వలు, వాటి ఖర్చుల గురించి చర్చించారు. ఏ సెంటర్‌లో పాడైన ఆహార పదార్థాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్రాల్లోని పిల్లల బరువును ఎప్పటికప్పుడు పరీక్షించి అవసరమైన వారికి తగిన పౌష్టికాహారం అందించాలని సూచించారు.

జాబితాలో పేరు లేదని ఆందోళన వద్దు

కలెక్టర్ రాహుల్‌రాజ్



మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



జాబితాలో పేరు లేదని కంటతడి పెట్టుకుంటున్న మహిళ

నర్సాపూర్: జాబితాలో పేర్లు లేని వ్యక్తులు ఆందోళన చెందవద్దని, అలాంటి వారి నుంచి దరఖాస్తులు తీసుకొని విచారణ చేపడతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ఆరవ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేరుస్తామని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కమిషనర్ రామకృష్ణరావు, ఆర్‌ఐ ఫైజల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేదని స్థానికురాలు మమత నాయకులతో తన గోడు వివరిస్తూ కంటతడి పెట్టింది.

వైద్యుల పనితీరు భేష్

నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు బాగా పని చేస్తున్నారని కలెక్టర్ అభినందించారు. బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులలో పర్యటించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు, మందులపై గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ఆస్పత్రిలో ఎలాంటి లోటుపాట్లు లేవని రోగులు చెప్పినట్లు ఆయన వివరించారు. ఇష్టానుసారంగా వార్డులలోకి రాకుండా కట్టడి చేయాలని, విజిటింగ్ టైంలోనే వచ్చి తమ వారిని చూసే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ పావని, ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అదనపు కలెక్టర్ నగేష్



గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పాపన్నపేట(మెదక్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లాపూర్‌లో జరిగిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా తదితర పథకాల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. గ్రామ సభలో వెల్లడించిన తర్వాతనే అర్హులను ఎంపిక చేస్తారని చెప్పారు. సభలో పేర్లు చదివిన తర్వాత ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు. సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా గుర్తించామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించామన్నారు. ఏమైన అనుమానాలుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆరు గ్యారంటీల పథకం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణువర్ధన్, జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



రామాయంపేట లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్)/చిలప్‌చెడ్(నర్సాపూర్)/రామాయంపేట(మెదక్): గ్రంథాలయాలతో విజ్ఞానం పెరగడంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని నూతన గ్రంథాలయానికి ఫర్నీచర్ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయానికి అవసరమైన వసతులు, పుస్తకాలను అందజేస్తామని చెప్పారు. అలాగే పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. ప్రహరీతో పాటు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిలప్‌చెడ్‌లో పర్యటించారు. త్వరలోనే గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించారు. అలాగే రామాయంపేట శాఖా గ్రంథాలయాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లాస్థాయిలో మొత్తం 16 మండలాల్లో లైబ్రరీలు ఉండగా, మిగితా మండలాల్లో ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సిబ్బంది కొరత ఉందని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జితేందర్



మాట్లాడుతున్న జడ్జి జితేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అన్నారు. బుధవారం మండలంలోని తునికి వద్ద గల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటి పడావో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులకు హక్కులతో పాటు బాధ్యతలు కల్పించిందన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లలు, మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆడ పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి, హెచ్‌డబ్ల్యూఓ శివరామకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ సంతోషి, కవిత, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగశాల.. ఎప్పటికో?

ఆరంభశూరత్వంగా పశు వ్యాధి నిర్ధారణ

ఆరేళ్ల క్రితం నర్సాపూర్‌లో నిర్మించిన జిల్లా స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల అలంకారప్రాయంగా మిగిలింది. సుమారు రూ. 20 లక్షల వ్యయంతో భవనం నిర్మించి, అవసరమైన యంత్రాలను సమకూర్చిన పాలకులు వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం విఫలమయ్యారు. దీంతో పశువులు అస్వస్థతకు గురైన సమయంలో జబ్బును నిర్ధారించేందుకు అవసరమైన టెస్టుల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

- సిబ్బందిని నియమించడంలో తాత్సారం
- ఇబ్బంది పడుతున్న రైతులు




నర్సాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న జిల్లా ప్రయోగశాల భవనం

నర్సాపూర్: కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన అనంతరం నర్సాపూర్‌లో జిల్లాస్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనుకున్నదే తడువుగా సుమారు రూ. 20 లక్షలు వెచ్చించి నూతన భవనంలో ప్రయోగశాలను ఏర్పాటు చేసింది. రూ. 5 లక్షలతో అవసరమైన యంత్రాలను సైతం సమకూర్చింది. అయితే అందులో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు. ఇద్దరు పశువైద్యులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు అటెండర్లు అవసరం కాగా ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రయోగశాల నిరుపయోగంగా మారింది. జిల్లాలో గేదెలు 1,22,444 ఉండగా, ఆవులు సుమారు 54 వేలు, మేకలు 1,51,000 ఉన్నాయి. గొర్రెలు 4,30,000 వరకు ఉన్నాయి.

సంగారెడ్డికి పరుగులు

కాగా జిల్లా రైతులకు చెందిన పశువుల జబ్బు నిర్ధారణ పరీక్షల కోసం సంగారెడ్డికి నమూనాలు పంపాల్సి వస్తోంది. పశుసంవర్ధక శాఖ సిబ్బంది అందుబాటులో లేని సమయంలో రైతులే సొంతంగా నమూనాలు తీసుకొని సంగారెడ్డి వెళ్తున్నారు. అక్కడ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి టెస్టుల కోసం నమూనాలు రావడంతో ఫలితాల కోసం ఎక్కువ సమయం పడుతున్నట్లు తెలిసింది. దీంతో రైతులపై ఆర్థిక భారం పడడంతో పాటు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాస్థాయి ప్రయోగశాల నర్సాపూర్‌లో అందుబాటులో ఉంటే దూరాభారం తగ్గడంతో పాటు టెస్టుల ఫలితాలు వెంటనే అందే అవకాశం ఉంటుంది. కాగా ప్రయోగశాల కోసం నిర్మించిన భవనంలోని ఒక గదిని పశు సంవర్ధకశాఖ అధికారులు వ్యాక్సిన్ నిల్వ కోసం వినియోగిస్తున్నారు. అవసరమైనప్పుడు జిల్లాలోని ఆస్పత్రులకు సరఫరా చేస్తున్నారు.


ప్రయోగశాల ప్రారంభించాలి



పశువుల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల దగ్గరలో ఉంటే మేలు జరుగుతుంది. పాడి గేదెలు జబ్బు చేసినప్పుడు సంగారెడ్డికి వెళ్లాల్సి రావడంతో ఖర్చు, సమయం వృథా అవుతుంది. ఇప్పటికైనా నర్సాపూర్‌లో నిర్మించిన ప్రయోగశాలను ప్రారంభించి రైతులకు మేలు జరిగేలా చూడాలి.

– సత్యనారాయణ, పాడి రైతు, శివ్వంపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



నర్సాపూర్‌లో ప్రయోగశాల ఏర్పాటు కోసం భవనం, యంత్రాలు అందుబాటులో ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ప్రయోగశాలకు అవసరమైన వైద్యులు, ఇతర సిబ్బందిని కేటాయించి ప్రయోగశాలను ప్రారంభించేందుకు తన వంతుగా కృషి చేస్తా.

– వెంకటయ్య, జిల్లా ఇన్‌చార్జి వెటర్నరీ అధికారి

న్యూస్‌రీల్

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్‌జోన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానిస్తే బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భారతరత్న ఇచ్చి గౌరవించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దళితవాడలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఎన్నికల్లో పోటీ చేస్తే అప్పటి ప్రధాని నెహ్రూ వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓడించారన్నారు. బీజేపీ హయాంలోనే ప్రధాని వాజ్‌పేయి అంబేడ్కర్ విగ్రహాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, సంగీత, సుంకోజు రాజు, ఆకుల రాము, సన్నీ, భరత్, వితలేష్, వంశీ పాల్గొన్నారు.

విజయ డెయిరీలో విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా కేంద్రంలోని విజయ పాల డెయిరీ మేనేజర్ రజిత వద్ద నుంచి దొంగతనానికి గురైన డబ్బుపై బుధవారం ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ సురేష్, అకౌంటెంట్లు డెయిరీలో రికార్డులను పరిశీలించారు. దోపిడీకి గురైన సొమ్ము ఎవరిదనే కోణంలో విచారణ చేపడుతున్నారు. అయితే పూర్తి విచారణ అనంతరం వివరాలు తెలియాల్సి ఉంది.

సులభ రీతిలో బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా బోధించాలని జిల్లా గణాంక అధికారి నవీన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఎల్‌ఎఫ్‌ఎన్ ద్వారా బోధనలు, విద్యార్థుల ప్రగతి, ఆన్‌లైన్‌లో నమోదు, పరీక్షలకు సన్నద్ధం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విఠల్, విజయ్‌కుమార్, ఆర్‌పీలు గోపి, కిషోర్, రాధాకిషన్, వెంకటేశం, సిబ్బంది సంపత్‌రెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యూనియన్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 317 ఉపాధ్యాయ దంపతులను ఒకే చోట చేర్చడం హర్షణీయమని స్టేట్ స్పౌజ్ ఫోరం యూనియన్ నాయకులు అన్నారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో వివిధ పాఠశాలలో పనిచేస్తున్న దంపతుల బదిలీలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడం హర్షణీయమని కొనియాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీఓతో 19 జిల్లాల్లో మాత్రమే దంపతుల ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షుడు వివేక్, గడ్డం కృష్ణ, బుర్రస్వామి, ప్రేమ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, కవిత, అంజలి, మమత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించిన ఒడిశా బృందం



పీహెచ్‌సీ వద్ద బృందం సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్‌)/తూప్రాన్‌: కౌడిపల్లి పీహెచ్‌సీని ఒడిశా రాష్ట్ర వైద్య బృందం బుధవారం సందర్శించి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌హెచ్‌ఎం (నేషనల్‌ హెల్త్‌ మిషన్‌) ఆధ్వర్యంలో బ్లాక్‌ లెవల్‌ ప్రోగ్రామ్‌ అధికారులు పీహెచ్‌సీ అధ్యయనానికి వచ్చారు. ఎన్‌హెచ్‌ఎం స్టేట్‌ కో ఆర్డినేటర్‌ జానకీరామ్‌, మండల వైద్యాధికారి శ్రీకాంత్‌, వైద్య సిబ్బంది ఒరిస్సా బృందానికి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. ఓపీ రిజిస్ట్రేషన్‌, వైద్య చికిత్సలు, ఇన్‌ పేషెంట్‌ వార్డు, మందుల పంపిణీ, ఫార్మసీ రూమ్‌, ల్యాబ్‌, కంప్యూటరీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఫెర్నాజ్‌, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తూప్రాన్‌ పట్టణంలోని ప్రభుత్వ (సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రంను ఒడిశా బృందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల కొరత, రోగులకు ఎలాంటి వైద్య పరీక్షలు అందిస్తున్నారు. తదితర విషయాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ అమర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆరుగురిపై కేసు నమోదు

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ మండలం నెంటూరు శివారులో పేకాట స్థావరంపై బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌, బేగంపేట పోలీసులు దాడిచేశారు. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నెంటూరు శివారు వ్యవసాయ షెడ్డులో కొందరు పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్‌ పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేయగా, నెంటూరుకు చెందిన ఆరుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.10,680 నగదు, 6 ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, ఫామ్‌హౌస్‌లు, ఇళ్లలో పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌ అధికారుల 87126 67445, 87126 67446 నంబర్లకు సమాచారమివ్వాలని సూచించారు.

మాదక ద్రవ్యాలు ధ్వంసం



ధ్వంసం చేస్తున్న అధికారులు

నర్సాపూర్‌: జిల్లాలోని ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ స్టేషన్ల పరిధిలో పట్టుకున్న మాదక ద్రవ్యాలను బుధవారం ధ్వంసం చేసినట్లు స్థానిక ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సీఐ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు అసిస్టెంట్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో మండలంలోని కాగజ్‌మద్దూర్‌ గ్రామంలోని మరిడి బయో ఇండస్ట్రీస్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీలో ధ్వంసం చేశామన్నారు. జిల్లాలోని ఆయా స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 21 కిలోల 428 గ్రాముల ఎండు గంజాయి, 19 గంజాయి మొక్కలు, 7 కిలోల 877 గ్రాముల ఆల్ప్రాజోలం, 3 కిలోల 95 గ్రాముల డైజోఫామ్‌, 160 గ్రాముల గంజాయి విత్తనాలు, 24 కిలోల ఆలంను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల విలువ రూ.94 లక్షల 7 వేల 68 ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సీఐలు నాగేశ్వరరావు, రాణి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: మానసిక స్థితి సరిగా లేని బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీనగర్‌ కాలనీకి చెందిన తేజస్విని(15) ఇంటి నుంచి 21న వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సహకారంలో ఆదర్శం.. సేవల్లో ఘనం

లాభాల బాటలో కోహెడ పీఏసీఎస్‌

- 15 ఏళ్లలో రూ.14 కోట్ల 30 లక్షల ఆదాయం
- ప్రతీయేటా రూ.కోటి లాభం
- రైతుల అభివృద్ధిపై ప్రత్యేక కృషి
- ఇటీవలె మంత్రి పొన్నం ప్రభాకర్‌ చేతుల మీదుగా నూతన కార్యాలయం ప్రారంభం
- ఉత్తమ సహకార సంఘంగా ఎంపిక



కోహెడ పీఏసీఎస్‌ కార్యాలయం

కోహెడ(హుస్నాబాద్‌): సహకార సంఘాలు చాలా వరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సంఘం, రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకే చెందినదే కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం. రూ.16 కోట్లతో కార్యకలాపాల నిర్వహణ కొనసాగిస్తూ.. ప్రగతి పథంలో ఆదర్శంగా నిలుస్తుంది.

శనిగరం, వింజపల్లి, సముద్రాల సంఘాల విలీనంతో మండలం మొత్తానికి ఒకే సంఘంగా 2005లో కోహెడ ప్రాథమిక వ్యవసాయ సంఘం ఏర్పాటైంది. రూ.1.70 కోట్లు వైద్యనథన్‌ ప్యాకేజీ ద్వారా తొలిసారిగా సంఘానికి ఆర్థిక సహకారం లభించింది. ఈ నిధులను డీసీసీబీలో జమ చేశారు. 2010లో డీసీసీబీలో జమ ఉన్న నిధులను విత్‌ డ్రా చేసి సంఘం సొంతంగా లావాదేవిలను ఆరంభించింది.

రూ.16 కోట్లతో కార్యకలాపాలు

రూ.1.70 కోట్ల నిధులతో ప్రారంభమైన సంఘం 15 ఏళ్లలో రూ.16 కోట్లతో కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఈ సంఘంలోని 1,388 మంది సభ్యులకు సుమారుగా రూ.14.50 కోట్లు స్వల్ప, దీర్ఘకాలిక, వ్యక్తిగత, బంగారు ఆభరణాలపై రుణాలు అందించి.. వారి ఆర్థికాభివృద్ధికి బంగారు బాటలు వేస్తుంది. ఈసారి వివిధ రకాల డిపాజిట్ల రూపకంగా రూ.1.04 కోట్ల నికర లాభం సమకూర్చింది.

నూతన కార్యాలయం

కోహెడ పీఏసీఎస్‌ నూతన కార్యాలయం భవనాన్ని ఇటీవలె మంత్రి పొన్నం ప్రభాకర్‌ చేతుల మీదుగా కార్యాలయం ప్రారంభించారు. నాబార్డు లోన్‌ ద్వారా రూ.85 లక్షలు, మిగితా రూ.15 లక్షలు సహకార సంఘం నిధుల నుంచి నూతన కార్యాలయం నిర్మించారు. కార్యాలయంలో లాకర్‌ సదుపాయం, ఎరువుల నిల్వ కోసం భవనంలో ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. నూతన హంగులతో కార్యాలయం రూపుదిద్దుకుంది. కార్యాలయం నిర్మాణం పై మంత్రి సంతృప్తి చెందారు.

15 ఏళ్లలో రూ.14.30 కోట్ల ఆదాయం

కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. బైక్‌లు, ట్రాక్టర్లు, వ్యక్తిగత రుణాలు, ఎరువుల వ్యాపారం, క్రాప్‌ లోన్‌ల మీద వడ్డీ, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు, పాల సంఘాలకు రుణాలు అందించి 15 ఏళ్లలో రూ.14.30 కోట్లు నిధుల నిల్వ చేశారు. దీంతో గతంలో సిద్దిపేట జిల్లాలో ఉత్తమ సహకార సంఘంగా ఎంపికైంది. రైతు కార్యకలాపాలు ఆన్‌లైన్‌ దిశగా కార్యచరణ సిద్ధం చేసి.. సాంకేతిక రంగం సద్వినియోగంపై ముందడుగు వేశారు.

తక్కువ వడ్డీతో రుణాలు



తక్కువ వడ్డీతో పంట రుణాలు అందిస్తున్నారు. బంగారు నగలు తాకట్టుతో అప్పులు ఇస్తుంద్రు. వడ్డీ వ్యాపారస్తుల చేతిలో మోసపోకుండా సహకార సంఘం కార్యాలయంలో అప్పులు అందిస్తున్నారు. దీంతో మాకు ఎలాంటి బాధ లేదు. చాలా సంతోషంగా ఉంది.

– చింతలపెల్లి తిరుపతిరెడ్డి, రైతు గొట్లమిట్ట

అభివృద్ధిలో సమష్టి కృషి



ప్రభుత్వ ప్రోత్సాహం, పాలక వర్గం సమష్టి సహకారం ద్వారా అభివృద్ధిలో ముందుకెళ్తున్నాం. రైతు కుటుంబాలకు తక్కువ వడ్డీతో ప్రత్యేక రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నం. విత్తనాలు, ఎరువులు సకాలంలో సబ్సిడీపై అందిస్తున్నం తక్కువ వడ్డీతో పంట, బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తున్నం. ఫిబ్రవరి రెండో వారంలో పదవి కాలం ముగియనుంది. సంఘం అభివృద్ధిలో భాగస్వాములుగా నిలిచిన పాలక వర్గం, కార్యాలయం సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– పేర్యాల దేవేందర్‌రావు, పీఏసీఎస్‌ చైర్మన్‌

బాధ్యతాయుతంగా పని చేస్తున్నం



సహకార సంఘం కార్యకలాపాల వ్యవహారాలపై పాలకవర్గం ప్రోత్సాహంతో బాధ్యతాయుతంగా పని చేస్తున్నం. ఇచ్చిన రుణాలను గడువు లోపు ఎప్పటికప్పుడూ సిబ్బందితో కలిసి వసూళ్లు చేస్తున్నం. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. సహకార సంఘం లావాదేవీలపై పాలకవర్గంతో సమీక్షలను నిర్వహిస్తున్నాం.

– ముంజ మల్లికార్జున్‌గౌడ్‌, పీఏసీఎస్‌ సీఈఓ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వర్గల్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం వర్గల్‌ మండలం గౌరారం వద్ద రాజీవ్‌రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. గౌరారం జనతా హోటల్‌ దగ్గర రాజీవ్‌ రహదారి దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తి(60)ని సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న బైక్‌ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అదే మార్గంలో వెళ్తున్న వాహనాలు కూడా అతడిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైకిస్టుకు కూడా గాయాలయ్యాయి. మృతుడి ఒంటిపై బ్లూ స్వెటర్‌, బ్లాక్‌ ప్యాంట్‌ ఉందని, ముస్లిం కావొచ్చని ఎస్‌ఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి..



సాయిలు(ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పిడిచెడ్‌ గ్రామంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీల సాయిలు(49)కు భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉండగా వివాహం జరిపింపాడు. కూలీ పనులు చేసుకుంటూ ఉండగా అప్పులు కావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే కుటుంబ తగాదాలు జరగడంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

చేగుంట(తూప్రాన్‌): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేగుంటలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన చేగుంటకు చెందిన మౌనిక(25) ఆదివారం వడియారం రైల్వే స్టేషన్‌ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రెండు కాళ్లు కోల్పోయిన మౌనికను రైల్వే సిబ్బంది చికిత్స నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు



సాయిచరణ్‌ గౌడ్‌ (ఫైల్‌)

దుబ్బాకరూరల్‌: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని హబ్షిపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్‌ కథనం మేరకు.. బోల్గం సాయిచరణ్‌గౌడ్‌(23) కుటుంబ పోషణ కోసం రూ.5 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురై 11న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజన్నసిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమలో పని చేసే ఓ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బొల్లారం సీఐ రవీందర్‌ రెడ్డి కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన మనోజ్‌ (28) స్థానిక లీ ఫార్మా పరిశ్రమలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం సెకండ్‌ షిఫ్టుకు వెళ్లాడు. రాత్రి భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురై పరిశ్రమ ప్రతినిధులకు సమాచారం అందించాడు. యాజమాన్యం ఎలాంటి చికిత్స అందించకుండా ఇంటికి వెళ్లమన్నారు. బుధవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మనోజ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మనోజ్‌ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలను వ్యక్తం చేశారు. మృతుడి బాబాయి ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్‌రూరల్‌: తెలంగాణ డిస్ట్రిక్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ (టీడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 24న అండర్‌–17 బాలుర విభాగంలో ఉమ్మడి మెదక్‌ జిల్లా క్రికెట్‌ క్రీడాకారుల ఎంపిక జరగనుందని ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ హరిశ్చంద్రప్రసాద్‌ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్‌ ఆఫీస్‌ కాంప్లెక్స్‌) సమీపంలోని మైదానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా బాలుర క్రీడాకారుల ఎంపిక జరగనుందన్నారు. ఎంపికైన వారు ఈనెల 27, 28, 29వ తేదీల్లో హైదరాబాద్‌ ప్రాంతంలోని దోమలగూడలో గల ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ గ్రౌండ్‌లో (పాత 9 జిల్లాలు) ఇంటర్‌ డిస్ట్రిక్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 2008 సెప్టెంబర్‌ 1 నుంచి 2010 ఆగస్టు 31 మధ్యన జన్మించిన వారు తమ ఆధార్‌, బోనఫైడ్‌తో పాటు సొంత క్రికెట్‌ కిట్‌, వైట్‌ జెర్సీతో ఈనెల 24న గజ్వేల్‌లో జరిగే సెలెక్షన్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7780596892 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శత శాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ



సూచనలిస్తున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

వర్గల్‌(గజ్వేల్‌): ఇంటర్‌ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా ఇంటర్మీడియట్‌ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. 90 రోజుల యాక్షన్‌ ప్లాన్‌ను కళాశాల అధ్యాపకులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను ఆయన సందర్శించారు. వివిధ రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు 90 శాతం హాజరు ఉండేలా చొరవ తీసుకోవాలని అన్నారు. అధ్యాపకులకు పలు సూచనలిచ్చారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

చిన్ననిజాంపేట గ్రామంలో వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్‌: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో మృతదేహమై తేలిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేర్ల రంజీత్‌(33) ఇంట్లో 21న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే రోజు భూంపల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం గ్రామ శివారులోని పోతారెడ్డిపేట పెద్ద చెరువు వద్ద బైక్‌ కనిపించింది. చెరువు వద్ద చెప్పులు,సెల్‌ ఫోన్‌ ఆధారంగా చెరువులో గాలించగా రంజీత్‌ మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విష గుళికలు తిని నెమళ్లు మృతి



మద్దూరు(హుస్నాబాద్‌): విష గుళికలు తిని రెండు నెమళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని గాగ్గిళ్లాపూర్‌ గ్రామానికి చెందిన రైతు గొండ్ల ఇస్తారి రోజు మాదిరిగానే బుధవారం బావి వద్దకు వెళ్లగా అక్కడ రెండు నెమళ్లు మృతి చెంది కనిపించాయి. రైతు విషయాన్ని అటవీశాఖ అధికారులకు చెప్పాడు. అటవీశాఖ అధికారులు వెళ్లి మృతి చెందిన నెమళ్లను పరిశీలించారు. విష గుళికలు తినడం వల్లే మృతి చెందినట్లు వారు నిర్ధారించారు.

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

జీవితంపై విరక్తి చెంది రైతు



చీమల రాజు (ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. బుధవారం మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీమల రాజు (45) తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య ప్రమీల, 14 ఏళ్లలోపు ఇద్దరు కూతుర్లు, కుమారుడిని పోషించుకుంటున్నాడు. ఇటీవల వ్యవసాయ పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికొస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో ఎడమకాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతోపాటు అనారోగ్యం తోడైంది. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చూయించుకోగా కాలు పూర్తిగా విషపూరితంగా మారిందని, తొలగించాల్సి వస్తుందని, లేదంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని డాక్టర్లు చెప్పారు. దీంతో మనోవేదనకు గురై కుంగిపోయాడు. మంగళవారం రాత్రి తన గొర్రెల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి

పటాన్‌చెరు టౌన్‌: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన కూలీ పని చేసే మాణిక్యం (45)ని 12 భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మాణిక్యం తల్లి వద్దే పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మాణిక్యం మద్యం తాగి ఇంటికొచ్చాడు. అర్ధ రాత్రి తల్లి నిద్రలేచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తట్టుకోలేక వివాహిత

మద్దూరు(హుస్నాబాద్‌): అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ కథనం మేరకు.. దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్‌ గ్రామానికి చెందిన లింగాల సరిత(27)కి ఐదేళ్ల కిందట రమేశ్‌ అనే వ్యక్తితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య తరచూ వరకట్నం కోసం గొడవలు జరుగుతుండేవి. వారం రోజుల కిందట వరకట్నం కోసం మరోసారి వేధించడంతో 19న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మేనత్త భూదవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రమేశ్‌, అత్త సమ్మవ్వ, బావ సంపత్‌లపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొల్లారంలో వ్యక్తి..

జిన్నారం (పటాన్‌చెరు): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన జనంగీ భాస్కరరావు(36) ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో ఉంటున్నాడు. ఓ హోటల్‌లో పని చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. 21వ తేదీన తాను పనిచేసే హోటల్‌ రూమ్‌ పక్కనే గల రేకుల కింద ఇనుప రాడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న కొడుకు బాలరాజు ఫిర్యాదు మేరకు బొల్లారం సీఐ రవీందర్‌ రెడ్డి కేసు నమోదు చేశారు.

దోపిడీ దొంగల అరెస్ట్‌

రామాయంపేట(మెదక్‌): జాతీయ రహదారిపై దారి దోపిడీకి పాల్పడ్డ నలుగురు దుండగుల్లో ఒకరిని సోమవారం అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం రాత్రి రామాయంపేట పట్టణ శివారులోని కేసీఆర్‌ కాలనీ సమీపంలో గల దాబా వద్ద మహారాష్ట్రకు చెందిన నలుగురు ఆగారు. అదే సమయంలో కత్తులతో అక్కడికి చేరుకున్న నలుగురు గుర్తు తెలియని దుండగులు వారిని బెదిరించారు. నాలుగు సెల్‌ఫోన్లతోపాటు రూ. 5వేల నగదు తీసుకొని పారిపోయారు. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు కేసీఆర్‌ కాలనీకి చెందిన గంగారాంను పోలీసులు అరెస్ట్‌ చేశారు. మిగితా ముగ్గురిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తి

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ మండలం మీనాజీపేటలో తాళం పగులగొట్టి ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని బుధవారం అరెస్ట్‌ చేసినట్లు గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొద్ది రోజుల కిందట మీనాజీపేటలో దొంగలు కర్రెల లక్ష్మి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం తూప్రాన్‌ డబుల్‌ బెడ్రూంలకు చెందిన సిరిగిరి నరసింహులు అనే వ్యక్తిని పట్టుకొని విచారించారు. మీనాజీపేటలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు ఇళ్లల్లో దొంగతనం

నిజాంపేట(మెదక్‌): రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండల కేంద్రంలో పెద్దపైడి శ్రీనివాస్‌ రెడ్డి ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు చొరబడి 40 తులాల వెండి, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే గ్రామంలోని బత్తుల రమేష్‌ ఇంటి తాళం పగులగొట్టి 7 తులాల వెండి, రూ.3 వేలు అపహరించినట్లు పేర్కొన్నారు. క్లూస్‌ టీమ్‌ ఆధారంగా పోలీసులు వేలి ముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరకు లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

జహీరాబాద్‌ టౌన్‌: చెరకు లారీ దగ్ధమైన ఘటన మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్‌ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. రైతు సంజీవ్‌రెడ్డి తన పొలంలోని చెరకు పంటను కర్మాగారానికి తరలించడానికి బుధవారం కూలీలు లారీలో పంటను లోడ్‌ చేశారు. పొలం నుంచి లారీ కర్మాగారానికి వెళ్తున్న సమయంలో పైనున్న కరెంట్‌ తీగలు తగిలాయి. షార్ట్‌సర్క్యూట్‌ వల్ల లారీలోని చెరకు పంటకు మంటలు అంటుకొని లారీతో సహా కాలిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్‌ కిందకు దూకాడు. దీంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌ ఇంజన్‌ వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదం వల్ల రూ.వేలల్లో నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

తప్పుడు పత్రాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్‌

లబోదిబోమంటున్న బాధితులు

తూప్రాన్‌: అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని బాధిత రైతులు బుధవారం తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దాతర్‌పల్లి గ్రామ సమీపంలో 24 ఎకరాల భూమిని కొన్నేళ్ల కిందట కొందరు రైతులు కొనుగోలు చేసుకొని పంటలు పండిస్తున్నారు. ఆ భూములపై బ్యాంకు రుణాలు సైతం పొందారు. కానీ కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్‌ చేసుకున్నారని ఆరోపిస్తూ బాధిత రైతులు ఆందోళన చేపట్టారు. ఈ విషయంలో తహసీల్దార్‌ విజయలక్ష్మిని వివరణ కోరగా కోర్టు నుంచి పత్రాలు సమర్పించడంతో తాము రిజిస్ట్రేషన్‌ చేశామని తెలిపారు. తమ భూములు తమకే తిరిగి రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరుతున్నారు.

సొంతింటి కలను నిజం చేస్తాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ లింగమూర్తి

హుస్నాబాద్‌: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో ఇందిరమ్మ మోడల్‌ హౌస్‌ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వం డబుల్‌ బెడ్రూం ఇళ్లను ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. గృహాలను పూర్తి చేయకుండానే పట్టాలు ఇచ్చి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, బీసీలు ఇతరులకు రూ.5 లక్షలు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వనుందన్నారు. హుస్నాబాద్‌ నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అదనపు గృహాల మంజూరు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌ ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్‌ వల్లపు రాజు, కాంగ్రెస్‌ నాయకులు ఎండీ హస్సేన్‌, పిల్లి తిరుపతి, కిష్టస్వామి, సింగరి, రమేశ్‌, రజిత తదితరులు ఉన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌

సిద్దిపేటరూరల్‌: సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌ అన్నారు. బుధవారం మండలంలో ఉన్న రాఘవాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలను సభల్లో అధికారులు చదివి వినిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వెంకటి, సంయోద్దీన్‌, వెంకటేశ్‌, రఘుపతి, మాజీ ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, నాయకులు నర్సింహులు, అశోక్‌గౌడ్‌, రాజు, తిరుపతి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకొమ్ముల్లలో..

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): సంక్షేమ పథకాలు అర్హుల దరిచేరుతాయని అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌ అన్నారు. బుధవారం మండలంలోని నకిరేకొమ్ముల్లలో నిర్వహిస్తున్న గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవకతవలకు ఆస్కారం లేకుండా అర్హులందరికీ పథకాలు వర్తించేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సురేఖ పాల్గొన్నారు.

వాగ్వాదం



సిద్దిపేటరూరల్‌: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌

సిద్దిపేటఅర్బన్‌: సిద్దిపేట అర్బన్‌ మండలం పొన్నాల, మిట్టపల్లి, బూరుగుపల్లి, కిష్టసాగర్‌ గ్రామాలలో గ్రామసభలు నిర్వహించగా పొన్నాలలో అడిషనల్‌ కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌ పాల్గొన్నారు. అర్హుల లిస్టును అధికారులు చదువుతున్న సందర్భంలో అనర్హులు ఉన్నారంటూ వారిని తొలగించాలంటూ పొన్నాల, మిట్టపల్లి గ్రామాల్లో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనర్హుల జాబితాను అందిస్తే మరోసారి విచారణ చేసి జాబితా నుంచి తొలగిస్తామని హమీద్‌ చెప్పడంతో వివాదం సర్దుమణిగింది.